జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 18 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 7

# ప్రజల విశ్వాసమే మా బలం...
## అభివృద్ధిలో సమన్వయం అవసరం

- ♦ అశ్వారావుపేట అభివృద్ధి ప్రజల ఆశయాలకు అనుగుణంగా సాగాలి- ఎమ్మెల్యే జారె



**దమ్మపేట,ఫిబ్రవరి. 17,(ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట మున్సిపాలిటీ నూతన తొలి చైర్ పర్సన్ గా ఎన్నికైన జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ గా ఎన్నికైన జూపల్లి రమేష్ గౌరవ ఎమ్మెల్యే

మిగతా 2 లో...





# ఉత్కంఠకు తెర

- మున్సిపల్ చైర్ పర్సన్ గా దొడ్డ కిరణ్ మిత్ర
- వైస్ చైర్మన్ గా పెండేల రాజు -ఏకగ్రీవంగా ఎన్నుకున్న కౌన్సిలర్లు
- ప్రమాణస్వీకారం చేయించిన అధికారులు
- ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి:ఎమ్మెల్యే

**ఇల్లందు, ఫిబ్రవరి 17, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ చైర్మన్ ఎంపిక ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రొసీడింగ్ అధికారి, కొత్తగూడెం ఆర్డిఓ మధు కౌన్సిలర్లచే ముందుగా ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ గా 2వ వార్డు కౌన్సిలర్, ఇల్లందు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్ భార్య దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ గా 17వ వార్డు కౌన్సిలర్ పెండేల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ 24 వార్డులకు గాను 19 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఇరువురు స్వతంత్రులు, ముగ్గురు బిఆర్ఎస్ కౌన్సిలర్లు గెలిచారు. స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన ఇరువురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఇల్లందు మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం 21 చేరింది. మున్సిపల్ చైర్ పర్సన్ గా దొడ్డ కిరణ్ మిత్ర ను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అదేవిదంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గా

మిగతా 2 లో...





# ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

## కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, ఫిబ్రవరి 17,ప్రజా జ్యోతి** జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మార్చి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ తో పాటు సంబంధిత విభాగాధిపతులను నియమించినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా, జరిగేలా అనుభవం కలిగిన ఇన్విజిలేటర్లను నియమించాలని ఆదేశించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రత విషయంలో పూర్తి

మిగతా 2 లో...

# 22మంది మావోయిస్టుల లొంగుబాటు



**చర్ల, ఫిబ్రవరి 17:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్ గఢ్ లోని సుక్మా జిల్లాలో నక్సల్స్ నిర్మూలన ప్రచారంలో భాగంగా మావోయిస్టు సంస్థకు చెందిన 22 మంది సభ్యులు మంగళవారం భద్రతా దళాల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఒక మహిళా మావోయిస్టు కూడా ఉన్నారు.పోలీసు అధికారుల ఛత్తీస్ గఢ్ ప్రభుత్వ పునరావాస విధానం సుక్మా పోలీసులు నిర్వహిస్తున్న "పునా మార్గెం" (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) ప్రచారం ద్వారా ప్రభావితమయ్యారు అని అంతర్గత ప్రాంతంలో కొత్త భద్రతా శిబిరాల ఏర్పాటు మెరుగైన రోడ్డు కనెక్టివిటీ ప్రభుత్వ పథకాలను పొందే అవకాశం వలన మావోయిస్టులు లొంగిపోయారు అని అన్నారు . మంగళవారం సుక్మాలోని పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో, ఎస్. అసల్ కుమార్, డిఐజి, సిఆర్ పిఎఫ్ రేంజ్, జగదల్ పూర్; రోహిత్ షా (ఐపిఎస్), అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నక్సల్ ఆప్స్)

మిగతా 2 లో...

# మీ ప్రచారంతో సత్తుపల్లిలో జోష్ వచ్చింది

- మంత్రి తుమ్మలకు కాంగ్రెస్ కౌన్సిలర్ల కృతజ్ఞతలు
- సత్తుపల్లి విజయంలో మంత్రి తుమ్మల కీలక పాత్ర
- గండుగులపల్లిలో ఘన సత్కారం



**దమ్మపేట, ఫిబ్రవరి. 17, (ప్రజా జ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశం రాజకీయ ఉత్సాహానికి కేంద్రబిందువైంది. సత్తుపల్లి మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్,వైస్ చైర్మన్ తో పాటు కొత్తగా ఎన్నికైన పాలకవర్గ కౌన్సిలర్లు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల కురుక్షేత్రంలో

మిగతా 2 లో...

## ఉత్కంఠకు తెర



(మొదటి పేజీ తరువాయి...)
ఎవరు ఊహించని 17వ వార్డు కౌన్సిలర్ పెండేల రాజు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగింది. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ పెండేల రాజు లు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతర కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి ఇల్లందు మున్సిపాలిటీని అగ్రభాగాన నిలుపుతామని స్పష్టం చేశారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే డ్రైనేజీ, మంచినీళ్లు, వీధిలైట్ల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ పెండేల రాజు, నూతన కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 22మంది మావోయిస్టుల లొంగుబాటు



(మొదటి పేజీ తరువాయి...)
అభిషేక్ వర్మ, అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సుక్మా; అలాగే సిఆర్ పిఎఫ్ కోబ్రా కార్ప్స్ నుండి సీనియర్ అధికారుల ముందు 22మంది మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతి లోకి కలిసారు . మావోయిస్టుల లొంగుబాటును విజయవంతం చేయడంలో డిఆర్ జి సుక్మా, జిల్లా దళం, రేంజ్ ఫీల్డ్ టీం (ఆర్ ఎఫ్ టి) జగదల్ పూర్, సిఆర్ పిఎఫ్ యొక్క 02, 111, 223, 227 బెటాలియన్లు కోబ్రా 201 బెటాలియన్ యొక్క ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ప్రత్యేక పాత్ర పోషించాయి అని అధికారులు అన్నారు. ఛత్తీస్గఢ్ ప్రభుత్వం "ఛత్తీస్ గఢ్ నక్సలైట్ సరెండర్/బాధిత సహాయ పునరావాస విధానం-2025" కింద, లొంగిపోయిన 22 మంది మావోయిస్టులకు ఒక్కొక్కరికి 50,000 రూపాయల ప్రోత్సాహకంతో తక్షణ సహాయం అందించబడుతుంది అని వారు సాధారణ మెరుగైన జీవితాన్ని తిరిగి ప్రారంభించేందుకు వారికి ఇతర ప్రభుత్వ పునరావాస సౌకర్యాలను కూడా అందించబడుతుంది అని అధికారులు అన్నారు .

# ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



(మొదటి పేజీ తరువాయి...)
అప్రమత్తత పాటించాలని సూచించారు. ప్రశ్నాపత్రాల నిల్వ, పంపిణీ, రవాణా ప్రక్రియలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, సంబంధిత పోలీస్ స్టేషన్లలో స్ట్రాంగ్ రూమ్ లను ఏర్పాటు చేసి భద్రత మధ్య రవాణా నిర్వహించాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి అమలు చేసి, సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల ప్రాంతంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. పరీక్షలు ముగిసిన అనంతరం జవాబు పత్రాలను అత్యంత జాగ్రత్తగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సంబంధిత మూల్యాంకన కేంద్రాలకు పంపించేందుకు పోస్టల్ శాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జవాబు పత్రాల సీలింగ్, భద్రతా తనిఖీలు, రవాణా ప్రక్రియలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని, నిర్ణీత కాలవ్యవధిలో గమ్యస్థానాలకు చేరేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్ష నిర్వహించు రోజుల్లో ఉదయం 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇచ్చారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య శాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సదుపాయాలు కల్పించి, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష రాయనున్న విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి , జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర రావు, టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, వైద్యశాఖ, పోలీస్ శాఖ, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్, పోస్టల్ శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసమే మా బలం...



(మొదటి పేజీ తరువాయి...)
జారె ఆదినారాయణ ను గండుగులపల్లిలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యే చేసిన విశేష కృషికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించిన తీరు విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో నిరంతరం శ్రమించి పార్టీకి ఘన విజయం అందించినందుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, ఈ విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణంలో ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందిస్తూ ప్రతి వార్డులో సమాన అభివృద్ధి జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మీ ప్రచారంతో సత్తుపల్లిలో జోష్ వచ్చింది



(మొదటి పేజీ తరువాయి...)
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అడుగు పెట్టిన క్షణం నుంచే రాజకీయ సమీకరణాలు మారిపోయాయని నూతన పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. పట్టు సడలుతున్న చోట పట్టు బిగించి, ప్రచార పర్వానికి తనదైన శైలిలో జోష్ నింపిన ఆయన రాకతోనే విజయం సాధ్యమైందని, ఎన్నికల సమయంలో నిర్వహించిన ప్రచార సభలు, రోడ్డు షోలు కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపాయని, స్తబ్దుగా ఉన్న కేడర్ సైతం మంత్రి రాకతో ఒక్కసారిగా యాక్టివ్ అయిందని కౌన్సిలర్లు గుర్తు చేసుకున్నారు. ప్రజల్లో ఉన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆయన చేసిన ప్రసంగాలు ఓటర్ల నాడిని మార్చాయని తెలిపారు. “సార్... మీరు ప్రచారానికి రావడం వల్లే మాలో ధైర్యం పెరిగింది. మీ మాటలు విన్నాక ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు” అంటూ మంత్రి తుమ్మలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మంత్రి తుమ్మల రాకతో సత్తుపల్లిలో ఏర్పడిన సానుకూల వాతావరణమే తమను గెలుపు తీరాలకు చేర్చిందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పేర్కొన్నారు. గెలిచిన అభ్యర్థులను సాదరంగా ఆహ్వానించిన మంత్రి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సత్తుపల్లి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.

## జే.ఈ.ఈ మెయిన్స్ లో దమ్మపేట గురుకుల విద్యార్థుల ప్రతిభ

**దమ్మపేట, ఫిబ్రవరి. 17, (ప్రజా జ్యోతి):** దమ్మపేట గురుకుల కళాశాల విద్యార్థులు జే.ఈ.ఈ మెయిన్స్ పరీక్షలో విశిష్ట ప్రతిభ కనబరిచి కళాశాలకు కీర్తి తీసుకొచ్చారు. దమ్మపేట గురుకుల కళాశాల నుండి ఎం. శశికుమార్, జి. సంజయ్, ఎ. చరణ్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. వెంకటేశ్వర్లు విద్యార్థులను అభినందిస్తూ, వారి కృషి, పట్టుదల, క్రమశిక్షణ అభినందనీయమని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఎల్. ఉపేందర్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.



విద్యార్థులకు మార్గనిర్దేశనం చేసి సబ్జెక్టులు బోధించిన అధ్యాపకులు డా. మదన్ లాల్ నాయక్, నరసింహారావు, ఉపేందర్ లను ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్ లెక్చరర్లు రంగారావు, ఉషారత్నం తదితర ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విజయంపై కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## న్యాయవాదుల రక్షణకు కట్టుదిట్టమైన చట్టం అవసరం - ఎమ్మెల్యే జారె

- దమ్మపేట లో న్యాయవాదుల ధర్నాకు సంఘీభావం



**దమ్మపేట, ఫిబ్రవరి. 17, (ప్రజా జ్యోతి):** దమ్మపేటలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిర్వహించిన ధర్నా ర్యాలీలో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని సంఘీభావం తెలిపారు. హైదరాబాద్ లో న్యాయవాది ఖాధీర్ హత్యను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేకంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ, న్యాయవాదులు సమాజంలో న్యాయం కోసం పోరాడే శక్తులని, వారి భద్రతను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఖాధీర్ హత్య ఘటన అత్యంత బాధాకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## గ్రహణం ఒక మూఢనమ్మకమే

- విజ్ఞాన దర్శిని మెంబర్ సత్యనారాయణ



**చర్ల ఫిబ్రవరి 17:(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో మంగళవారం సూర్యగ్రహణం పై విజ్ఞాన దర్శిని మెంబర్ సత్యనారాయణ మాట్లాడుతూ భూమికి ,సూర్యుడికి మధ్యకు చంద్రుడు రావడం వల్ల సూర్యకిరణాలు భూమికి పూర్తిగా చేరుకోలేవు అని దీనినే సూర్యగ్రహణం అంటాము అని సూర్యగ్రహణం వల్ల మనుషులు బయటికి రావద్దని చెప్పడం పూర్తిగా అవాస్తవం అని శాస్త్రీయంగా ఆధారం లేదని మంగళవారం వచ్చిన గ్రహణం ఒక వలయాకార సూర్యగ్రహణం అని ఇది ప్రధానంగా అంటార్కిటికా ఖండంలో మాత్రమే పూర్తిగా కనిపిస్తుంది అని దక్షిణ ఆఫ్రికా, మడగాస్కర్, దక్షిణ చిలీ–అర్జెంటీనా వంటి ప్రాంతాల్లో పాక్షికంగా కనిపిస్తుంది అని భారతదేశంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఈ గ్రహణం అసలు కనిపించలేదు కాబట్టిబయటికి రావడం వల్ల ఏమీ ప్రమాదం లేదు అన్నారు. సూర్యగ్రహణం సమయంలో సూర్యుడిని నేరుగా చూడకూడదు , కానీ ఇక్కడ అది అసలు కనిపించడం లేదు కాబట్టి ఆ భయం కూడా లేదు అని సూర్య, చంద్ర గ్రహణ సమయంలో అందరూ బయటకు వచ్చి ఎవరి పనులు వారు చేసుకోవచ్చని అన్నారు.

## ఎస్ అండ్ పిసి సిబ్బందికి నాలుగు రోజుల శిక్షణా తరగతులు ప్రారంభం





**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 17 ప్రజాజ్యోతి:**సింగరేణి వ్యాప్తముగా ఉన్న ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ గార్డులకు విడతల వారీగా నిర్వహించే ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతులలో భాగముగా 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు కొత్తగూడెం ఎస్&పిసి ట్రైనింగ్ సెంటర్ నందు నిర్వహించే 54 వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఏరియా సెక్యూరిటీ అధికారి / ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ హాజరై ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భముగా ఏరియా సెక్యూరిటీ అధికారి / ట్రైనింగ్ అధికారి యం.డి. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ... సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని, మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని, ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అని, ఈ శిక్షణ వలన డ్యూటీ జీవితం లోనే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని, ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం, మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్, క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా, మెయిన్ గేటు వద్ద, చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ లేకుండా సాఫీగా అందరు తమ విధులను సక్రమంగా నిర్వహించేందుకు దోహదం చేస్తుంది అని, యస్ & పిసి విభాగము పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు, యస్& పిసి ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుంది అని, కావున సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. నారాయణరెడ్డి, ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు నాయకత్వం వహించాలి

- నూతన సర్పంచులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్







**పాల్వంచ, ఫిబ్రవరి 17,ప్రజా జ్యోతి** గ్రామాల సమగ్రాభివృద్ధిలో గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను నియమ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వినియోగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్పంచులకు పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కెఎస్ఎం ఓల్డ్ క్యాంపస్)లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, జిల్లాలోని మొత్తం 471 మంది గ్రామ పంచాయతీ సర్పంచులకు విడతల వారీగా శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండవ విడత శిక్షణ కార్యక్రమం ఈనెల 17 నుండి నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.రెండవ విడతలో భాగంగా అశ్వారావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 233 మంది నూతన సర్పంచులు శిక్షణలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామ పాలన, పరిపాలన విధానాలు, బాధ్యతలు, కర్తవ్యాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని అన్నారు.శిక్షణలో భాగంగా పంచాయతీ రాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామపంచాయతీలకు అందుతున్న అభివృద్ధి పథకాల నిధులను సక్రమంగా వినియోగించి తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, పబ్లిక్ టాయిలెట్లు వంటి వసతుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల పరిస్థితిని సర్పంచులు నిరంతరం పర్యవేక్షించి చిన్నారులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ లేదో పరిశీలించాలని సూచించారు. అక్షరాస్యత పెంపు, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.జిల్లాలో ఉన్న పర్యాటక అవకాశాలను సద్వినియోగం చేసుకుని గ్రామాల ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇల్లందు ,పూబెల్లి, రోళ్ళపాడు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి ప్రాంతాల్లోని కారుకొండ, జూలూరుపాడు ప్రాంతంలోని వ్యవసాయ విశిష్టతలను విస్తృతంగా ప్రచారం చేస్తే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందే అవకాశముందని తెలిపారు.సర్పంచులు పంచాయతీ శాఖకే పరిమితం కాకుండా గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ఇప్ప, ఇప్పపువ్వు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామస్తులకు అదనపు ఆదాయ వనరులు సృష్టించవచ్చని, పశుసంపద అభివృద్ధి, మేత సంపద పెంపుతో ప్రభుత్వ సబ్సిడీలుగ్రామాల్లో పొందే అవకాశముందని వివరించారు.18 నుండి 20 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా యంత్రాంగం నిర్వహించే ఇంటర్వ్యూలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి యువతను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సర్పంచులను కోరారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సర్పంచులకు శిక్షణ కిట్లను అందజేశారు. గ్రామ పాలనకు అవసరమైన మార్గదర్శక పుస్తకాలు, చట్టపరమైన సూచనలు, అభివృద్ధి పథకాల సమాచార పత్రాలు తదితర అంశాలు కిట్లలో అందజేయబడినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి , డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్టీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్రత్ వలి, ఏపీవో రంగ, ఎస్బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టు నిలుపుకున్న పింగళి కుటుంబం

- అధికారాన్ని తరిమి కొట్టిన 19వ వార్డు ఓటర్లు
- మూడు తరాలుగా కాంగ్రెస్ కు సేవ చేస్తున్న పింగళి కుటుంబం
- కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో బీఆర్ఎస్ నుండి పోటీ
- స్పష్టమైన తీర్పునిచ్చిన 19వ వార్డు ప్రజలు
- ప్రజల సమస్యలు, వారికి అండగా ఉంటాను: కౌన్సిలర్ పింగళి అనూహ్య





**ఇల్లందు, ఫిబ్రవరి 17, ప్రజాజ్యోతి:**పింగళి కుటుంబం అంటే కాంగ్రెస్ పార్టీకి పెట్టింది పేరు.. గత మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీకి ఆ కుటుంబం ఎంతో పని చేసింది. పింగళి కుటుంబంలో తాత, తండ్రి, మేనమామలు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతగానో పని చేయడం జరిగింది. ఆ కుటుంబం శక్తి వంచన లేకుండా పని చేస్తూ కాంగ్రెస్ నీ అంటిపెట్టుకొని ఉంటూ వస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 19వ వార్డు నుంచి అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా అవకాశం కల్పించాలని కోరడం జరిగింది. కొందరి వల్ల తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదని, దీంతో వేరే ప్రత్యామ్నాయంగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. 19వ వార్డు బిఆర్ఎస్ పార్టీ టికెట్ సాధించి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఘన విజయం సాధించారు. ప్రచార సమయంలోను ఆ వార్డు ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని, తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించమనీ గుర్తు చేశారు. దింతో 19వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై పింగళి నరేష్ సతీమణి పింగళి అనూహ్యను ఆదరించి గెలిపించారు. తన తండ్రి పింగళి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో గత కొన్ని ఏళ్ల నుండి కొనసాగడం జరుగుతుందని, వారసత్వంగా తాను కూడా కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పాత్ర పోషించానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కొందరి స్వార్థం వల్లనే తన కుటుంబానికి టికెట్ రాకుండా అడ్డు అనుకున్నారని, కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలో చేరి టికెట్ సాధించి విజయం సాధించి చూపానని స్పష్టం చేశారు. దివంగత కాంగ్రెస్ నాయకులు రాజమల్లుకు ఆర్థికంగా వెన్నుదన్నుగా పింగళి కుటుంబం నిలుస్తూ నాడు పార్టీ పిలుపు మేరకు కార్యక్రమాలు చేపట్టారనీ, గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు దీటుగా నాడు పింగళి కుటుంబం కాంగ్రెస్ నుండి కార్యక్రమాలు చేపడుతూ పార్టీ పటిష్టతను కాపాడుతూ వచ్చిందన్నారు. పింగళి నరేష్ సుమారుగా 3 ఏళ్లకు పైగా ఇల్లందు మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడితో పాటు నియోజకవర్గ కన్వీనర్ గా కొనసాగుతున్నాడు. వ్యాపారం, వృద్ధిపరంగా నిత్యం బిజీగా ఉండే పింగళి నరేష్ ప్రజా సేవలో తన వంతు పాత్రను పోషిస్తున్నారు. ఎందరికో తన వంతు సాయం చేస్తూ మీకు అండగా నేనున్నానంటూ భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్నాడు. ఇంతటి రాజకీయ నేపథ్యం ఉన్న పింగళి కుటుంబాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ సద్వినియోగం చేసుకోలేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వార్డు కౌన్సిలర్ గా తన భార్య పింగళి అనూహ్య వార్డు సమస్యలు పరిష్కారంతోపాటు నిత్యం వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని పింగళి నరేష్ తెలిపారు.

# దమ్మపేట మండలంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- సేవా కార్యక్రమాలతో ఆకట్టుకున్న బి.ఆర్.యస్ నాయకులు
- పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి ఫ్రూట్స్ పంచిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా





**దమ్మపేట, ఫిబ్రవరి. 17, (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బి.ఆర్.యస్ పార్టీ అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు దమ్మపేట మండలంలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. మండల బి.ఆర్.యస్ అధ్యక్షుడు దొడ్డ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బి.ఆర్.యస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను మరింత ఉత్సాహభరితంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసిన నాయకులు, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ అపూర్వమైన నాయకత్వాన్ని గుర్తుచేస్తూ, పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి దేశానికి ఆదర్శంగా నిలిపారని కొనియాడారు. రాబోయే కాలంలో తిరిగి తెలంగాణకు ఆయన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం, మందలపల్లి, నాచారం గ్రామపంచాయతీ, పెద్దగొల్లగూడెం, నల్లకుంట, చిన్నగొల్లగూడెం తదితర గ్రామాల్లో కూడా కేసీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో సోయం వీరభద్రం, దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు, జలగం వాసు, చీకట్ రామారావు, రావుల శ్రీను, అబ్దుల్ జిన్నా, తుమ్మల లక్ష్మణ్ రావు, గాజుబోయిన ఎసుబాబు, తాటి పోతురాజు, సోడెం గంగరాజు, మండవ సత్య, యార్లగడ్డ శ్రీను, కాసిని శ్రీను, మహేశ్, మద్దెల పుల్లారావు, నాగరాజు, ప్రసాద్, నరేంద్ర, రవి, రామకృష్ణ, రాజారావు, పసుమర్తి రాంబద్రం, గోళ్ళ భవాని కృష్ణ యాదవ్, రూపా రాంబాబు, ఉయ్యాల లక్ష్మీనారాయణ, ఏడుకొండలు, మీడియం సురేష్, పాయం ప్రవీణ్, కోర్స వెంకటేష్, మధు, ఇప్ప శేషాద్రి, భూక్యా రాజు, కిస్ట సత్తి, పానుగంటి లోకేష్, పోలారావు తదితరులు పాల్గొన్నారు.మొత్తంగా దమ్మపేట మండలంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి.

# కెఓసి మైన్లో పర్యటించిన డైరెక్టర్ పి. పి



**టేకులపల్లి,ఫిబ్రవరి17,ప్రజాజ్యోతి :** ఇల్లందు ఏరియా టేకులపల్లి మండల కోయగూడెం ఓసి లో మంగళవారం సింగరేణి డైరెక్టర్ (పి. పి) కె. వెంకటేశ్వర్లు పర్యటించారు. కెఓసిలోని వ్యూ పాయింట్ నుంచి పని జరిగి స్థలాలను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. ఇల్లందు ఏరియా జిఎం వి.కృష్ణయ్యను బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబి బ్లాస్టింగ్, లోడింగ్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్(పి. పి) మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారి లక్ష్యాలను అధికమించాలని ఆయన అన్నారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎటువంటి ఆటంకములు కలుగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఉద్యోగులకు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైన్ లో రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని తెలిపారు. సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో పి.ఓ కే.ఓ.సి. గోవిందరావు, కే.ఓ.సి మేనేజర్ శ్రీనివాస రావు,క్వాలిటీ మేనేజర్ రామదాసు, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి,ఇతర అధికారులు,ఉద్యుగులు పాల్గొన్నారు.

# సౌరశక్తితో స్వయం సమృద్ధి దిశగా గండుగులపల్లి

- పైలట్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, ఫిబ్రవరి. 17, (ప్రజా జ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామాన్ని 100 శాతం సోలార్ విద్యుత్ వినియోగ గ్రామంగా అభివృద్ధి చేసే దిశగా కీలక ముందడుగు పడింది. గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్వగ్రామమైన గండుగులపల్లిలో ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో అమలు చేస్తున్న సోలార్ విద్యుత్ పైలట్ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక శక్తి వినియోగాన్ని ప్రోత్సహిస్తూ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలకు సౌర విద్యుత్ సదుపాయాలు కల్పిస్తున్నదని తెలిపారు. ఈ క్రమంలో గండుగులపల్లి గ్రామం 100% సోలార్ విద్యుత్ వినియోగ గ్రామంగా పైలట్ ప్రాజెక్ట్‌కు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు.ప్రస్తుతం సోలార్ ప్యానెల్లు,అవసరమైన పరికరాల అమరిక పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందడంతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గి, అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు సోలార్ విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని, గ్రామీణాభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. గండుగులపల్లి రాష్ట్రానికి ఆదర్శ గ్రామంగా నిలవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అన్నపురెడ్డిపల్లి ఆలయాల సందర్శనకు కోకా కోలా కంపెనీ అధికారులు

- .ఫ్రిజ్ బహుకరణతో పాటు భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటన



**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 17,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్న శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయం మరియు శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయాలను మంగళవారం కోకా కోలా కంపెనీ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా రెండు ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు నైనాల రామ్‌కుమార్, కుమార్ స్వామి, సత్యప్రసాద్, శివరామకృష్ణలు ఆలయ ప్రాంగణాలను పరిశీలించి అక్కడ నెలకొని ఉన్న ఆధ్యాత్మిక వాతావరణానికి హర్షం వ్యక్తం చేశారు. ఆలయాల చరిత్ర, విశేషాలు, నిర్మాణ కట్టడాలపై ఆలయ నిర్వాహకుల ద్వారా వివరాలు తెలుసుకుని భక్తి పర్వశులయ్యారు. అనంతరం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి ఒక ఫ్రిజ్‌ను బహుకరించారు. అలాగే శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి కూడా త్వరలో ఫ్రిజ్ అందజేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఈ రెండు ఆలయాలు మరింత అభివృద్ధి చెందేందుకు తమ వంతు సహకారం నిరంతరం అందిస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ అధికారులను ఆలయ ఈవో రమణ, అసిస్టెంట్ ఈవో సంపత్, ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శివాలయం పాలక మండలి సభ్యులు గుజ్జ పూర్ణచంద్రావు, రంజా బుచ్చమ్మ, మాయర కృష్ణ, బోయినపల్లి వెంకటేశ్వరరావు, నల్లవెల్లి వెంకటేశ్వర్ల కృష్ణయ్యలతో పాటు మల్లెల నాని, మల్లెల సాయి, ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో నెలకొన్న ప్రశాంతత, భక్తి వాతావరణం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. గ్రామ ప్రజలు ఈ సహకారాన్ని హర్షిస్తూ, ఇటువంటి సేవాభావ కార్యక్రమాలు మరింత కొనసాగాలని ఆకాంక్షించారు. ఆలయాల అభివృద్ధికి ఇది మంచి ఆరంభమని పలువురు భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# 12 మావోయిస్టుల స్మారక చిహ్నాల కూల్చివేత

- * రెండు ఐఈడీల నిర్వీర్యం







**చర్ల, ఫిబ్రవరి 17: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలోని భద్రతా దళాలు మంగళవారం నిర్వహించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో వివిధ ప్రదేశాలలో మావోయిస్టులు నిర్మించిన మొత్తం 12 స్మారక చిహ్నాలను కూల్చివేసాయి. ఈ ఆపరేషన్ సమయంలో భద్రతా దళాలు రెండు ఐ ఈ డి లను కూడా స్వాధీనం చేసుకుని వాటిని సురక్షితంగా నిర్వీర్యం చేశారు. మావోయిస్టు ప్రభావాన్ని తొలగించి, ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పే దిశగా భద్రతా బలగాలు శోధనని కొనసాగిస్తున్నారు.సి ఆర్ పీ ఎఫ్ డి 214 నిర్వహించిన ఏరియా డామినేషన్ ఆపరేషన్ సమయంలో, పిల్లూర్ అడవిలోని బడే కాక్లేర్ పుల్గుండం సమీపంలో మావోయిస్టులు నిర్మించిన ఏడు స్మారక చిహ్నాలను గుర్తించారు. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఈ సమయంలో ఒక స్మారక చిహ్నం సమీపంలో కార్డెక్స్ వైర్ తో నిండిన రెండు బీర్ బాటిళ్లలో ఐ ఈ డి లను దళాలు స్వాధీనం చేసుకున్నాయి. యూనిట్ యొక్క బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ బృందం రెండు ఐ ఈ డి లను అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేసింది. తదనంతరం ఏడు స్మారక చిహ్నాలను కూల్చివేశారు.గంగాలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సి ఆర్ పీ ఎఫ్ 85వ బెటాలియన్ మల్లూరు అడవిలో ఉన్న 12 అడుగుల ఎత్తైన మావోయిస్టు స్మారక చిహ్నాన్ని కూల్చివేసింది. అదే ప్రాంతంలో, సి ఆర్ పీ ఎఫ్ 222 పలనార్ గ్రామానికి సమీపంలోని మూడు పెద్దకోర్మ గ్రామంలో ఒక మావోయిస్టు స్మారక చిహ్నాన్ని ధ్వంసం చేశారు.మావోయిస్టులు నిర్మించిన నిర్మాణాలు, చిహ్నాలు క్రమపద్ధతిలో గుర్తించి నాశనం చేస్తున్నామని భద్రతా దళాలు స్పష్టం చేశాయి. మావోయిస్టు సంస్థలు తమ కార్యకర్తలు గ్రామస్తులలో భయం ఒత్తిడిని కొనసాగించడానికి ఈ స్మారక చిహ్నాలను ఉపయోగించాయి అని అధికారులు అన్నారు .ఈ చిహ్నాల తొలగింపు కేవలం భౌతిక నిర్మాణాల తొలగింపు మాత్రమే కాదు అని మావోయిస్టు భావజాలం అక్రమ ఆధిపత్యానికి వ్యతిరేకంగా శక్తివంతమైన సందేశం కూడా అని భవిష్యత్తులో మావోయిస్టులు ఏ చిహ్నాలను తిరిగి స్థాపించలేరని నిర్ధారించడానికి ఈ ఆపరేషన్ కొనసాగుతుందని భద్రతా దళాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతాన్ని మావోయిస్టు ప్రభావం నుండి పూర్తిగా విముక్తి చేయడం శాశ్వత శాంతి, నమ్మకం అభివృద్ధి వాతావరణాన్ని సృష్టించడం పరిపాలన లక్ష్యం అని అధికారులు అన్నారు .

# మల్కారం డబుల్ మర్డర్ కేసు తీర్పు... నిందితుడికి జీవిత ఖైదు

- దర్యాప్తు అధికారులకు ఎస్పీ అభినందనలు

**దమ్మపేట,ఫిబ్రవరి.17,(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 సంవత్సరంలో మల్కారం గ్రామంలో జరిగిన ద్విహత్య కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది.గుడిమెట్ల సుబ్బ లక్ష్మి,గుడిమెట్ల గురవారావు హత్య కేసులో నిందితుడైన మల్లవరపు శ్రీనివాస రావుపై విచారణ పూర్తి చేసిన అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జి వసంత్ పాటిల్ ఈరోజు తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవితకాల కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ బాలకృష్ణ (సీఐ) పాత్రను అధికారులు ప్రశంసించారు. అలాగే కోర్టులో కేసు సక్రమంగా ట్రయల్ జరిగేలా సమన్వయం చేసిన కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సేవలను కూడా అభినందించారు.ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ తదితరులు దర్యాప్తు అధికారులను, కోర్టు సిబ్బందిని అభినందించారు. నేరస్తులకు చట్టం ప్రకారం కఠిన శిక్షలు పడేలా పోలీసులు కట్టుదిట్టమైన దర్యాప్తు నిర్వహిస్తారని వారు పేర్కొన్నారు.

# గండుగులపల్లిలో నేడు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**దమ్మపేట, ఫిబ్రవరి. 17, (ప్రజా జ్యోతి):** దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామం లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం 8:00 గంటలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు.నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ జారే ఆదినారాయణ చేతుల మీదు గా ఈ చెక్కులను అందజేయనున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెం దిన మొత్తం 40 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంజూరైన ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత లబ్దిదారులు నిర్ణీ త సమయా నికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జయంత్ రెడ్డి ప్రతిభ



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 17 (ప్రజా జ్యోతి):** ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సారపాక బ్రిలియంట్ కళాశాల నుంచి జాతీయ స్థాయిలో 95.98శాతం మార్కులతో విద్యార్థి కె.జయంత్ రెడ్డి ప్రతిభ కనబర్చారని, భద్రాచలం డివిజన్ లో అగ్రగామిగా నిలిచారని బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్ లో ప్రతిభ కనబర్చిన జయంత్ రెడ్డిని పుష్పగుచ్ఛం మెమెంటోతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. బ్రిలియంట్ విద్యార్థులు ఇప్పటికే టాప్టాన్ కళాశాలల్లో, యూనివర్సిటీల్లో సీట్లు సాధించారని చెప్పడానికి తమకు గర్వంగా ఉందన్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎప్సెట్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎప్సెట్ కోచింగ్ రాయబోయే విద్యార్థులు తమ అప్లికేషన్లు పూర్తిచేసి కోచింగ్ తీసుకోవడానికి పూర్తి వివరాలకు 9705137128, 9866283566లను సంప్రదించాలని కోరారు.

# అంబరాన్నంటిన కేసీఆర్ జన్మదిన సంబరాలు



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 17 (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రానికి దిక్సూచి తెలంగాణ జాతిపిత, ఉద్యమ సృష్టికర్త, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, సారపాక పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను అన్నారు. కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన బూర్గంపహాడ్, సారపాక ప్రధాన సెంటర్లలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వారు కేసీఆర్ జన్మదిన కేకు కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం బూర్గంపహాడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ హయాంలో జరిగిన పదేళ్ల అభివృద్ధిని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎనలేని అభివృద్ధి జరిగిందన్నారు. అన్నదాతల సంక్షేమానికి కేసీఆర్ పాటుపడ్డారని రైతుబంధు, రైతుబీమా ప్రవేశపెట్టి అన్నదాతల గుండెల్లో గూడుకట్టుకున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి అపరభగీరథునిగా గుర్తింపు పొందారని కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో యావత్ తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోయిందన్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయనకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సారపాక పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, తాళ్లగొమ్మూరు సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, యూత్ అధ్యక్షులు సోము లక్ష్మిచైతన్యరెడ్డి, చల్లకోటి పూర్ణ, బెజ్జంకి కనకాచారి, తుపాకుల రవికుమార్, గుల్మహ్మద్, మేడిగం లక్ష్మినారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సానికొమ్ము శంకర్రెడ్డి, తిరుపతి ఏసోబు, బాలి శ్రీహరి, మాజీ ఏఎంసీ చైర్మన్ పొడియం ముత్యాలమ్మ, ఎల్లంకి లలిత, పొడియం నరేందర్, ఖాదర్, చట్టు ఆంజనేయులు, పంగి సురేష్, బానోత్ శ్రీను, సాలయ్య, మోహన్, బొల్లు సాంబ, జక్కం సర్వేశ్వరరావు, వెంకట రమణ, పాటి అశోక్, భూక్యా కృష్ణ, బాలిరెడ్డి చిన్నప్పరెడ్డి, బొబ్బిలి, దాసు, నాగరాజు, కె.నాగేశ్వరరావు, అప్పారావు, తోకల శ్రీను, నర్సింహారావు, దుర్గ, బర్ల సత్యనారాయణ, గంగపురి చంద్రశేఖర్, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు, వివిధ పంచాయతీల సర్పంచ్లు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనం ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సిద్ధిస్తుంది

- పోటీ పరీక్షల అభ్యర్థులకు గ్రంథాలయాలు కల్పవృక్షాలు
- పుస్తక పఠన ఆవశ్యకత బాహ్య ప్రపంచానికి తెలిపేలా పుస్తక ప్రియుల పాదయాత్రలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు






**టేకులపల్లి, ఫిబ్రవరి17,ప్రజా జ్యోతి:** పుస్తక పఠనం ద్వారా సంపూర్ణ విజ్ఞానం వస్తుందని, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సిద్ధిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు వెల్లడించారు. టేకులపల్లి శాఖ గ్రంథాలయం టేకలపల్లి పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందిచడంకై పుస్తక ప్రియుల పాదయాత్ర మంగళవారం టేకులపల్లి తహసిల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పరీక్షల విధి విధానాల పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తుందని దాని అనుకూలంగానే అన్ని పుస్తకాలను అభ్యర్థుల కోసం గ్రంథాలయాల్లోఅందుబాటులో ఉంచుతామని తెలిపారు. గ్రంథాలయాలు గ్రామీణ పోటీ పరీక్షల అభ్యర్థులకు కల్పవృక్షాలుగా ఆధారిస్తూ, ఆశ్రమం ఇస్తున్నాయని తెలిపారు. పుస్తక ప్రియులు చాగంటి కృష్ణమూర్తి మాట్లాడుతూ..గ్రంథాలయంపై తనకు 50 సంవత్సరాల అనుబంధం ఉందని, గ్రంథాలయాలు విద్యార్థులకు ఉన్నత స్థానాలకు చేరడానికి ఉపయోగపడుతాయని అన్నారు.ఏదైనా విషయంపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకోవాడానికి పుస్తకాన్ని మించిన సాధనం లేదన్నారు. డిజిటల్ యుగంలో పుస్తకాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విజ్ఞానాన్ని సమకూర్చుకోవడం అవసరమేనని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి గ్రంథపాలకుడు ఆర్ నాగన్న, గ్రావీటి స్కూల్ హెచ్ఎం బ్రహ్మాచారి, టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మోహన్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ బసవమ్మ, గ్రంథపాలకుడు బాబురావు, ఉపాధ్యాయులు శంకర్, టేకులపల్లి 4వార్డు నెంబర్ జాటోత్ కిరణ్, పీవైఎల్ నాయకులు నోముల భానుచందర్, సీపీఐ మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ పాల్గొన్నారు.

# కేటీఆర్ సేన భద్రాద్రి జిల్లా ఇంచార్జ్ గా విజయ్



**టేకులపల్లి, ఫిబ్రవరి17, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేటీఆర్ సేన జిల్లా ఇం చార్జ్ గా టేకులపల్లి మండలం కొత్త తండా పీ పంచాయతీకి చెందిన జాటోత్ విజయ్ కుమా ర్ మంగళవారం ఎన్నికయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్ తనకు జిల్లా ఇంచార్జ్ బా ధ్యతలు ఇచ్చినందుకు దన్యవాదలు తెలిపారు.రానున్న రోజున్న బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, మూడేళ్ళలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీకిని గ్రామాల్లో బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అభిమాన నాయకుడికి పుట్టినరోజు వేడుకలు

- మాజీ జెడ్పిటిసి.మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఘనంగా కేక్ కటింగ్



**ఆళ్ళపల్లి. ఫిబ్రవరి17. ప్రజాజ్యోతి:** ఆళ్ళపల్లి మండలం లో మర్కోడు గ్రామం లో మంగళవారం గులాబీ దళం ఉత్సాహం అభిమాన నాయకుడి జన్మదిన వేడుకలు.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలు మర్కోడు లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు మరియు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాయం నరసింహారావు పాల్గొని కేసీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.వీరితో పాటు నాయకులు.యసారపు బాబు పొదిలారాము.కనకాచారి. వెంకటేశ్వర్లు.అంజయ్య.సత్యం.పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని ఈ వేడుకలను జయప్రదం చేశారు.


# వే బ్రిడ్జి తూకంలో అవకతవకలు

- రోజుకు 100–150 టన్నుల బొగ్గు గల్లంతు..?
- సింగరేణికి నష్టం... లారీ ఓనర్లకు జరిమానా భారం
- నెలకు వేల టన్నుల తేడా.. అధికారులు మౌనం
- సాంకేతిక లోపమా? పర్యవేక్షణ లోపమా?

**టేకులపల్లి, ఫిబ్రవరి 17, ప్రజాజ్యోతి :** సింగరేణి కు చెందిన కోయగూడెం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (ఓసి)లో వే బ్రిడ్జి తూకంలో తలెత్తిన లోపాలు సంస్థకు భారీ నష్టం తెచ్చిపెడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణలో లోపం కారణంగా ప్రతిరోజూ 100 నుంచి 150 టన్నుల వరకు బొగ్గు అదనంగా బయటకు వెళ్తోందని సమాచారం. కోయగూడెం ఓసి నుంచి ప్రతిరోజూ బాడీ లారీలు, టిప్పర్ల ద్వారా వివిధ పరిశ్రమలకు బొగ్గు రవాణా జరుగుతోంది. కోల్ యార్డ్‌లో లోడ్ చేసిన ప్రతి లారీకి వే బ్రిడ్జిపై తూకం వేస్తారు. అయితే గత ఐదారు నెలలుగా ఈ వే బ్రిడ్జిలో సాంకేతిక లోపం ఉన్నప్పటికీ, దాన్ని సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో లారీకి టన్ను నుంచి టన్నున్నర వరకు అదనంగా బొగ్గు లోడ్ అవుతోందని లారీ ఓనర్లు చెబుతున్నారు. ప్రతిరోజూ సుమారు 30–40 బాడీ లారీలు, 150 వరకు టిప్పర్ ట్రిప్పులు సాగుతున్నాయి. ఈ లెక్కన రోజుకు 100–150 టన్నుల వరకు తేడా వస్తోందని అంచనా. నెలకు ఇది 3,000 నుంచి 5,000 టన్నుల వరకు చేరుతుందని, గత నాలుగు నుంచి ఐదు నెలల్లో దాదాపు 15 వేల టన్నుల వరకు సంస్థకు నష్టం జరిగి ఉండొచ్చని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రకు బొగ్గు తీసుకెళ్లిన ఓ లారీ సరిహద్దు వే బ్రిడ్జి తనిఖీలో అదనంగా 1 టన్ను 200 కిలోల బొగ్గు ఉన్నట్లు తేలడంతో రూ.28 వేల జరిమానా విధించబడింది. వే బ్రిడ్జి లోపం కారణంగా అదనపు బరువు వచ్చినప్పటికీ, జరిమానా మాత్రం లారీ యజమానికే భారం అయింది. సింగరేణి నిర్లక్ష్యం వల్ల లారీ ఓనర్లు నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలువైన బొగ్గు అదనంగా బయటకు వెళ్లడం సంస్థకు నష్టమైతే, ఆ తేడా కారణంగా ఇతర రాష్ట్రాల్లో జరిమానాలు పడటం రవాణాదారులకు మోయలేని భారమవుతోంది. సాంకేతిక లోపాన్ని సకాలంలో గుర్తించి సరిచేసి ఉంటే ఈ పరిస్థితి రాకపోయేదని కార్మిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.









**ఈ అంశంపై కోయగూడెం ఓసి పీవో గోవిందరావును ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందన లభించలేదు.**

ఇప్పటికైనా వే బ్రిడ్జి వ్యవస్థను సమగ్రంగా తనిఖీ చేసి సాంకేతిక లోపాలను సరిచేయాలని, సంస్థకు నష్టం జరగకుండా, లారీ యజమానులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని రవాణాదారులు, కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

## రూ.2కోట్ల బీమా సొమ్ము కోసం హత్యాయత్నం

- -హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు
- -కేసు వివరాలు వెల్లడించిన ఎస్సై మేడా ప్రసాద్



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 17 (ప్రజా జ్యోతి ):** బీమా సొమ్ము కోసం స్నేహితుడిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను బూర్గంపహాడ్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మేడా ప్రసాద్ కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రాలోని ఎటపాక మండలం గన్నవరం గ్రామానికి చెందిన కట్టా యశ్వంత్ 14న రాత్రి మండల పరిధిలోని మోతే పట్టీనగర్ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలయ్యాడని తెలుసుకుని యశ్వంత్ అత్త ములిశెట్టి రమ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారని, అవి రోడ్డు ప్రమాదానికి గురై తగిలిన దెబ్బలు కావని భద్రాచలానికి చెందిన కట్టా సాయిదీపక్, భానుప్రకాష్ అనే వ్యక్తులు ఇన్సూరెన్స్ డబ్బుల కోసం హత్యాయత్నం చేశారని అనుమానం వ్యక్తం చేశారన్నారు. ఆమె ఫిర్యాదుతో కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అయితే మంగళవారం సాయంత్రం కట్టా సాయిదీపక్, భానుప్రకాష్ కారులో వెళుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా యశ్వంత్ కు వారిద్దరూ స్నేహితులుగా చెప్పారన్నారు. భానుప్రకాష్ యాక్సెస్ బ్యాంకులో సేల్స్ ఆఫీసర్ గా పనిచేస్తున్నాడని గత ఏడాది నవంబర్ నెలలో కట్టా యశ్వంత్ పేరుమీద వీరిద్దరూ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుని నామినీగా కట్టా సాయిదీపక్కు ఉన్నారన్నారు. పథకం ప్రకారం 14న రాత్రి కట్టా యశ్వంత్ నీ మోతే సమ్మక్క సారలమ్మ గద్దెల వద్దకు తీసుకువెళ్లి అక్కడ అతనికి మద్యం తాగించారు. తిరిగి స్కూటీపై ఎక్కే సమయంలో వెనుక నుంచి రాడ్డుతో యశ్వంత్ పై దాడిచేసి హత్యాప్రయత్నం చేశారన్నారు. అయితే అతను చనిపోతే రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి తనకు వచ్చే రూ.2కోట్ల బీమా సొమ్ము తీసుకోవచ్చని ఈ నేరానికి పాల్పడినట్లు నేరం అంగీకరించారని ఎస్సై తెలిపారు. హత్యాయత్నానికి కారణమైన సాయిదీపక్, భానుప్రకాష్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

## దమ్మపేటలో టిడిపి కార్యకర్తల సమావేశం

- టిడిపి జెండాను ఇతర రాజకీయ పార్టీలు ఉపయోగిస్తే తీవ్ర పరిణామాలు
- మంగళగిరి జాతీయ కార్యాలయానికి భారీగా వెళ్లే నిర్ణయం



**దమ్మపేట, ఫిబ్రవరి. 17, (ప్రజా జ్యోతి ):** దమ్మపేట మండలంలో టిడిపి పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కార్యకర్తలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయం తీసుకోకుండా కొంతమంది నాయకులు స్వలాభం కోసం పార్టీని వేరే రాజకీయ పార్టీలకు తాకట్టు పెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. మండలంలోని కార్యకర్తలందరూ కలిసి భారీ ఎత్తున టిడిపి జాతీయ కార్యాలయం, మంగళగిరి వెళ్లి పార్టీ అధిష్టానాన్ని కలవాలని నిర్ణయించారు. తెలంగాణలో టిడిపికి అధికారిక కమిటీలు లేకపోవడంతో కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే నాయకత్వం లోపించిందని వారు పేర్కొన్నారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని, అయితే పార్టీ అధిష్టానం నుండి స్పష్టమైన ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. తమను సంప్రదించకుండా ఇతర రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో టిడిపి జెండాను ఉపయోగిస్తూ ప్రచా రం చేసుకోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఇకపై పార్టీ అనుమతి లేకుండా టిడిపి జెండాను ఇతర రాజకీయ పార్టీలు ఉపయోగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని కార్యకర్తలు హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు గడ్డిపాటి సత్యం, కొండపల్లి కృష్ణమూర్తి, బొల్లా మోహన్ రావు, భోగి సత్యం, చరమల శీను, చెవ్వ వెంకట్, పానుగంటి రామారావు, అబ్బూరి కృష్ణమూర్తి, చద్ర ధర్మారావు, పారుపల్లి వీరభద్రం, చక్రపూ ప్రసాద్, పల్లెల గాంధీ, కూకులకుంట సురేష్, కూకలకుంట కోనేశ్వరరావు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

- తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.





**టేకులపల్లి, ఫిబ్రవరి17, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 72వ పుట్టిన రోజు వేడుకలు బిఆర్ఎస్ మండలం నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రజలకు,పాఠశాలలోని విద్యార్థులకు అరటి పండ్లు కంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడుగా కీర్తి గణించిన మహోన్నత వ్యక్తి కేసీఆర్ అని, ప్రజా రైతు సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పాలన కొనసాగిందని, దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపిన మహోన్నత వ్యక్తిగా చరిత్ర సృష్టించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు.తెలంగాణలో కేసీఆర్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోనే ఆదర్శమని, చిరస్థాయిగా నిలుస్థాయని కొనియాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు లబ్ది పొందాయన్నారు. జిల్లా బీఆర్ఎస్ నాయకులు భూక్య దళ్ సింగ్ నాయక్, మండల అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్, టేకులపల్లి సర్పంచ్, ప్రధాన కార్యదర్శి బోడా బాలునాయక్, ఉపాధ్యక్షులు బానోత్ రామానాయక్, చిమల సత్యనారాయణ, గోల్యాతండా సర్పంచ్ లకావత్ నాకా, చుక్కలబోడు సర్పంచ్ బానోత్ రామానాయక్, బద్దుతండా సర్పంచ్ నరేష్, టేకులపల్లి ఉప సర్పంచ్ అనంతుల వసంత. ఉద్యమనాయకులు భూక్యా లాలునాయక్, మండల మహిళ నాయకురాలు ఆమెడ రేణుక, మాజీ ఎంపీటీసీలు జాలాది అప్పారావు, భూక్య బాలకృష్ణ, మాళోత్ పూల్సింగ్, రాజేష్, నాగభూషణం,బానోత్ బాలాజీనాయక్, వార్డు నెంబర్ జీజా, రాంకుమార్, మౌలనా పాల్గొన్నారు.